క్లుప్తంగా

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించటానికి అవకాశం

చిలకలూరిపేటటౌన్: శ్రీరామనవమి సందర్భంగా ప్రభుత్వ సెలవు రోజు అయినప్పటికి విద్యుత్ బిల్లులు చెల్లించటానికి కౌంటర్లు పని చేస్తాయని విద్యుత్ ఏడీఈ ఆర్ అశోక్‌కుమార్ చెప్పారు. పట్టణంలోని వెంకటేశ్వరదియేటర్ ఎదురుగా ఉన్న విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో విద్యుత్‌వినియోగదారులు ఉదయం 10గంటల నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని తెలిపారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు డిగ్రీ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరిరోజు కెమిస్ట్రీ-2, కామర్స్-2 పరీక్షలు జరిగాయి. మొత్తం 347 మంది విద్యార్థులకు గాను 7 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఫ్లయింగ స్క్వాడ్ బృందం తనిఖీ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా కేఎం రత్నకుమార్, డీవోగా రమేష్‌బాబు వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య పర్యవేక్షించారు. పరీక్షలు పూర్తి కావటంతో విద్యార్థులు కోలాహలంగా పరీక్షా కేంద్రం నుంచి వెలుపలికి వచ్చారు.

అభివృద్ధికి పోరాటాలు చేయాలి

నరసరావుపేట ఈస్ట్: పల్నాడుజిల్లా సమగ్ర అభివృద్ధికి, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ శ్రేణులు నిరంతర పోరాటాలు చేయాలని ఆపార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. వరికెపూడిసెల ప్రాజెక్ట్, హరిచ్చంద్రపురం నుంచి నకరికల్లు వరకు చేపట్టనున్న డాక్టర్ వైఎస్సార్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు మందపాటి రమణారెడ్డి, కాసా రాంబాబు పాల్గొన్నారు.

మర్రిపాలెం సొసైటీ సీఈవోగా శ్రీనివాసరావు

యడ్లపాడు: మండలంలోని మర్రిపాలెం వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘం సీఈవోగా డి శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఈవో శ్రీహరి ఇటీవల కాలంలో రిటైర్డ్ కావడంతో ఆయన స్థానంలో ప్రస్తుతం రొంపిచర్ల మండలం అన్నవరం సొసైటీలో సీఈవోగా విధులు నిర్వహిస్తూ శ్రీనివాసరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఘనంగా పౌష్టికాహార పక్షోత్సవాలు



వినుకొండ టౌన్: ప్రధానంగా గర్భవతులు ఎదుర్కొనే రక్తహీనత సమస్యను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పౌష్టికాహార పక్షోత్సవాలను నిర్వహిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. శ్రీలత, ఏనుగుపాలెం పీహెచ్‌సీ వైద్యులు రామ్ నాయక్ పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని ఏనుగుపాలెం సెక్టార్ పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని ఒకటవ సెంటర్ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఆహారంలో చిరు ధాన్యాలను తీసుకోవడం ద్వారా మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. అంతేకాకుండా గర్భవతులు రక్తహీనతను ఎదుర్కొనేందుకు దోహదపడతాయని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకోవచ్చని తెలియచేశారు. కార్యక్రమంలో మండలంలోని 34 కేంద్రాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో పోషకాలున్న ఆహారం తీసుకోవాలి

నాదెండ్ల: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలని మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి చెప్పారు. మండలంలోని గొరిజవోలు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేకంగా మంచి పోషక విలువలు ఉన్న కిట్లను అందిస్తుందని, వీటిని గర్భిణులు, బాలింతలు, బాలికలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఫుడ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. తక్కువ ఖర్చుతో తయారు చేసిన ఆహార పదార్థాల రుచిని చూసి అభినందించారు. సూపర్‌వైజర్ పద్మ పోషణ పక్వాడా కార్యక్రమం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీలక్ష్మి, విమల, యామిని, ఖాదర్‌బీ, ప్రసన్న పాల్గొన్నారు.

ఒకటిన బహిరంగ వేలం

నరసరావుపేట: పురపాలకసంఘానికి చెంది నిరుపయోగంగా ఉన్న పాతవాహనాలు, ఐరన్ స్క్రాపుకు ఏప్రిల్ ఒకటవ తేదీ శనివారం ఉదయం 11గంటలకు పురపాలకసంఘ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ముందు జాగ్రత్తగా చెరువులకు నీరు



మంచినీటి చెరువును పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

- మంత్రి విడదల రజిని
- పసుమర్రు మంచినీటి చెరువు పరిశీలన

చిలకలూరిపేట: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపుతున్నట్లు వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని చెప్పారు. పసుమర్రు మంచినీటి చెరువును స్థానిక పార్టీ నాయకులతో కలసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో సకాలంలో చెరువు నిండక ప్రజలు ఇబ్బందులు పడేవారని చెప్పారు. ఈ పరిస్థితిని గమనించి ముందు జాగ్రత్తగా చెరువును పూర్తి స్థాయిలో నింపడం జరిగిందని వెల్లడించారు. చెరువు నిండడం పట్ల గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, 16వ వార్డు కౌన్సిలర్ షేక్ మస్తాన్‌వలి, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఆ ఘనత ముఖ్యమంత్రి జగనన్నదే
- మంత్రి మేరుగ నాగార్జున
- వినుకొండ 19వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వంలో మంత్రి



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, పక్కన ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వినుకొండ పట్టణంలోని 19వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి మంత్రి మేరుగ నాగార్జున ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు అర్హులైన వారికి రూ.2 లక్షల కోట్లకు పైగా నవ రత్నాల పేరుతో బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. అలాగే అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలకు 30 లక్షలకు పైగా ఇళ్లు నిర్మిస్తున్న ఘనత తమదేనన్నారు. చంద్రబాబు హయాంలో ఏ రోజైనా సంక్షేమ పథకాలు ఇంటి వరకు వెళ్లాయా అని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే బొల్లా హయాంలోనే వినుకొండ అభివృద్ధి

స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఎమ్మెల్యేగా గెలవడం వినుకొండ ప్రజల అదృష్టమని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో వినుకొండను అన్నివిధాలుగా అభివృద్ధి చేశారన్నారు. గతంలో వెనుకబడిన ప్రాంతంగా తాగునీరు దొరకని వినుకొండ రూపురేఖలు మార్చిన ఘనత బొల్లాకే దక్కుతుందన్నారు. ముస్లిం మైనార్టీ కళాశాల, ఘాట్ రోడ్డు నిర్మాణం, స్టేడియం, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు, రోడ్ల విస్తరణతో పాటు అనేక అభివృద్ధి పనులు చేశారని, రానున్న రోజుల్లో ఇలాంటి వ్యక్తిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవాల్సిన బాధ్యత వినుకొండ ప్రజలపై ఉందని పిలుపునిచ్చారు. అనంతరం ముస్లిం సోదరులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ ఎం.ఎ సేకే. బాషా, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, వార్డు కౌన్సిలర్లు పాపసాని బ్రహ్మయ్య, నంది నరసింహారావు, షకీలా దస్తగిరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనసున్న మహారాజు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వైఎస్సార్ ఆసరా పథకంతో మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



ఆసరా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: వైఎస్సార్ ఆసరా పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలని నియోజకవర్గ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. బుధవారం మండలంలోని వేల్పూరు గ్రామంలోని కళ్యాణ మండపంలో మండల స్థాయిలో వైస్సార్ ఆసరా పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం వైఎస్సార్ క్రాంతి పథకం అధికారులు, మహిళా సభ్యులు సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం అనంతరం సీఎం సందేశాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైస్సార్ ఆసరా పథకంలో అర్హత కలిగిన మహిళలందరికీ ఇప్పటి వరకు రుణమాఫీ నిమిత్తం రూ.19 వేల కోట్ల 117 లక్షలు మంజూరు చేసిందన్నారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మనసున్న మారాజు అని పేదలందరికీ అన్నీ రకాల సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందజేస్తున్నారన్నారు.

అనంతరం శావల్యాపురం మండలంలోని 706 మహిళా గ్రూపుల్లోని సభ్యులకు వైఎస్సార్ ఆసరా రుణామాఫీలో భాగంగా రూ.5 కోట్లు 51 లక్షల 30వేల చెక్కును అందజేసి తదుపరి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, వైఎస్ ఎంపీపీ నంబూరి ప్రభావతి, వైస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు మహిళలు పాల్గొన్నారు.

మేలో గృహప్రవేశాలు చేయాలి

- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- టిడ్కో కాలనీని సందర్శించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి



టిడ్కో గృహాల వద్ద లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: టిడ్కో గృహాల వద్ద ఏప్రిల్ నెలాఖరు నాటికి చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తిచేసి లబ్ధిదారులు మే నెలలో గృహప్రవేశాలు చేసేందుకు అనుమతి ఇవ్వటం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పట్టణ శివారు చిలకలూరిపేట రోడ్డులో గల 'ఏపీ టిడ్కో గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీని' బుధవారం సందర్శించారు. అక్కడ చేపట్టిన ప్రధాన రహదారిపై వంతెన నిర్మాణం, చిన్నారులకు ఏర్పాటు చేసిన పార్కు, మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంక్, భూగర్భ రిజర్వాయర్ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం, టిడ్కో హౌస్‌లోని 1500 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం కేవలం 450/- రూపాయలకే టు కేవీ సామర్థ్యంగల విద్యుత్ కోసం 614 మంది లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం పూర్తయిందన్నారు. తాగునీటి సరఫరా కోసం రైలు పట్టాల కిందుగా పైపులైను వేసేందుకు రైల్వే అధికారుల నుంచి అనుమతి తీసుకున్నామన్నారు. మెయిన్‌రోడ్డు నుంచి టిడ్కో గృహాల వరకు సీసీ రోడ్డు వేయిస్తున్నామన్నారు. వచ్చే నెల 15వ తేదీ నాటికి విద్యుత్ కనెక్షన్లు ఇస్తారన్నారు. నివసించేందుకు మంచి వాతావరణం ఉన్నందున లబ్ధిదారులు అందరూ గృహప్రవేశాలు ఖచ్చితంగా చేయాలని ఎమ్మెల్యే కోరారు. తొలుత నిర్మించిన గృహాలను పరిశీలించారు. బ్యాంకుల నుంచి రుణం తీసుకునే విషయంలో పలువురు లబ్ధిదారుల సందేహాలను తీర్చారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు, డీఈ ఓలేటి శ్రీనివాసరావు, టీపీఎస్ అనూరాధ, విద్యుత్, హౌసింగ్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర అధ్యయనం అవసరం



ఫెస్ట్‌లో పాల్గొన్న అతిథులు, కళాశాల ప్రతినిధులు

నరసరావుపేట రూరల్: విద్యార్థులు ప్రతి విషయాన్ని సమగ్రంగా అధ్యయనం చేయాలని రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కమిషనరు ఎస్ఏపీ ప్రసాదరావు సూచించారు. బుధవారం పెట్లూరివారిపాలెం సమీపంలోని ఏఎంరెడ్డి విద్యాసంస్థల్లో నిర్వహించిన ఏఎస్ఆర్ ఇగ్నైటెడ్ మైండ్స్-2023 ఫెస్ట్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అట్టహాసంగా నిర్వహించిన ఫెస్ట్‌కు ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు టీవీ నారాయణ, జేఎన్‌టీయు-కే ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు, యాక్సిస్ క్లినికల్ లేబొరేటరీ జాయింట్ డైరెక్టర్ ఏజేసీ రెడ్డి, ఏపీ బార్ డిసిప్లేనరీ కమిటీ మాజీ కమిటీ మెంబర్ ఎస్.బ్రహ్మనందరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరుకాగా, గౌరవ అతిథులుగా విద్యాసంస్థల సెక్రటరీ అండ్ ప్రెసిడెంట్ అట్లూరి శాంతి, జి.చంద్రశేఖరరెడ్డి, అనసూయ హాజరయ్యారు. అతిథులుగా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.జయకృష్ణ, ఫార్మసీ ప్రిన్సిపల్ పి.భార్గవ భూషణరావు, డిప్లమా ప్రిన్సిపల్ కె.కృష్ణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన టెక్నికల్, కల్చరల్, పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, క్విజ్, వివిధ రకాల క్రీడల్లో విజేతలకు అతిథులు నగదు బహుమతి, జ్ఞాపికలు అందజేశారు. అనంతరం విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు.

పరిశుభ్రతతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం

- ద్విచక్ర వాహనంపై పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి
- వార్డుల్లో పారిశుధ్య పరిశీలన



33వ వార్డులో ఓ మహిళ చెబుతున్న సమస్యను ఆలకిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: పట్టణంలో పరిశుభ్రత ఉంటేనే ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం ఉంటుందని, అందువలన పరిశుభ్రత అనేది ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. పురవీధుల్లో పారిశుధ్య పరిశీలనలో భాగంగా బుధవారం నాల్గవ రోజు మోటార్ సైకిల్‌పై అధికారులతో కలిసి 32, 33, 34వ వార్డుల్లోని బరంపేట, బీసీ కాలనీ, చాకిరాల మిట్ట, బైపాస్ మసీద్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని డ్రెయిన్లను పరిశీలించారు. పలువురు మహిళలను పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరాపై ప్రశ్నించి వారిచ్చిన సమాధానంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ పచ్చదనంతో పాటు పరిశుభ్రత కూడా చాలా అవసరమన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం నిత్యం పట్టణం మొత్తం పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి పురపాలక శాఖ అధికారులు పాటుపడుతున్నారన్నారు. మంచి పరిశుభ్రమైన వాతావరణం ఉంటే అందరు ఆరోగ్యంగా ఉంటారన్నారు. చెత్తను ఎవరూ రోడ్లపై వేయవద్దని, ఇళ్ల వద్దకే వచ్చే మున్సిపల్ వాహనాల్లో వేసి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాసరావు, డీఈ ఓలేటి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు కారుమంచి మీరావలి, షేక్ రెహమాన్, మాడిశెట్టి మోహనరావు, సయ్యద్ మహబూబ్, సయ్యద్ బాజి, ఎస్‌సీసెల్ పట్టణ అధ్యక్షులు మల్లెల అశోక్, మర్రిపూడి రాంబాబు, షేక్ మీరావలి, అల్లంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలి

- ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- డ్వాక్రా సంఘీయులకు వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ



డ్వాక్రా మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: మహిళలు అందరూ ఆలోచన చేసి మళ్లీ ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవల్సిన అవసరం వారిపైనే ఉందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. లేని పక్షంలో వారే లక్ష్యంగా అందజేస్తున్న సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయని హెచ్చరించారు. బుధవారం స్థానిక టౌన్‌హాల్‌లో మండల వెలుగు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైయస్సార్ ఆసరా మూడో విడత నిధుల పంపిణీకి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నరసరావుపేట మండల పరిధిలోని 1557 పొదుపు సంఘాల్లోని 15,570 అక్క చెల్లెమ్మలకు ప్రభుత్వం అందజేసిన రూ.11,75,84,398 వైఎస్సార్ ఆసరా సొమ్ము చెక్కు అందజేశారు. డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో చేసిన వాగ్దానం మేరకు మూడు విడతల్లో రాష్ట్ర వ్యాప్తంగా రూ.19,130 కోట్లు రుణమాఫీ చెల్లించారన్నారు. చంద్రబాబు 2014లో ఎన్నికల సందర్భంగా బేషరతుగా రైతులకు రుణమాఫీ చేస్తానని ప్రకటించి ఎన్నికల అనంతరం మర్చిపోయాడన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మోరబోయిన సుబ్బాయమ్మ శ్రీనివాసరావు, ముదిరాజు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్లు ఇయం.స్వామి, ఎస్.సుజాతాపాల్, ఈవోపీఆర్డీ విజయకుమార్, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు మెంబర్లు, వైయస్సార్ సీపీ మండల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

సొసైటీ డిపాజిటర్లకు తొలగనున్న ఇక్కట్లు

యడ్లపాడు: మండలంలోని మర్రిపాలెం సొసైటీ ఖాతాదారులకు కొత్త చిక్కు వచ్చి పడింది. సొసైటీలో డబ్బులు డిపాజిట్ చేసుకున్న వారి పరిమిత కాలం పూర్తయినా తమ డబ్బుల్ని డ్రా చేసుకునే వీలులేక గత రెండు నెలలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో ఈ సొసైటీ త్రిసభ్య కమిటీ రద్దు కావడంతో ఇక్కడ జిల్లా అధికారులు ఇన్‌చార్జి అధికారిని నియమించారు. సదరు నియామకమైన అధికారి ఆరోగ్య సమస్యలపై లాంగ్‌లీవ్‌పై వెళ్లారు. దీంతో సొసైటీలో పనిచేస్తున్న అంజమ్మకు ఆ బాధ్యతను అప్పగించారు. అయితే సొసైటీలో డబ్బులు డిపాజిట్ చేసుకున్న వారి నగదు డ్రా చేసుకునేందుకు కార్యదర్శితో పాటు ప్రత్యేక అధికారి సంతకాలు అవసరం. ఫిబ్రవరిలో బాధ్యతలు చేపట్టి విధులు నిర్వహిస్తున్న అంజమ్మకు చెక్ పవర్ లేదని చెప్పడంతో సొసైటీలో డబ్బులు డిపాజిట్ దారులు ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ విషయంపై సదరు అధికారిని సాక్షి ప్రశ్నించగా గురువారం నుంచి చెక్ పవర్ అందుబాటులోకి వస్తుందని, డిపాజిటర్లు ఆందోళన చెందవద్దన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

చిలకలూరిపేట: నిరుపేదలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పొట్టి వెంకటేశ్వర్లు వర్ధంతిని పురస్కరించుకొని అనాథ, పేద విద్యార్థులకు దుప్పట్లు, ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్మన్ రఫాని మాట్లాడుతూ తండ్రి జ్ఞాపకార్థం ప్రతిఏటా అనాథ, నిరుపేద విద్యార్థులకు చేయూత అందిస్తున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా 100మందికి దుప్పట్లు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, కొప్పురావూరి నాగేశ్వరరావు, జీవీ రాఘవులు, మాజేటి నరేంద్ర, కేవీఎస్ కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ

శావల్యాపురం: పేదరికం ప్రతిభకు అడ్డుకాదని విశ్వశాంతి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ యడవల్లి శ్రీనివాసశర్మ అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ చేశారు. ఈసందర్భంగా పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో 575 మార్కులు సాధించిన విద్యార్థులకు ఇంటర్‌మీడియల్ విద్య ఉచితంగా చేర్చుకుంటామన్నారు. 550 మార్కులు సాధించిన విద్యార్థులకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తామన్నారు. విద్యార్థులు విద్యను ఇష్టంతో పోటీతత్వంతో చదివి మంచి మార్కులు సాధించి నూరుశాతం ఉత్తీర్ణత సాధించి గ్రామానికి పాఠశాల మంచి పేరు తేవాలన్నారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు బి.భువనేశ్వరదేవి, బెజవాడ చారిట్రబుల్ ట్రస్టు చైర్మన్ సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు హనుమంతరావు, నిర్మలకుమారి, సువర్చలాదేవి, ప్రశాంతకుమారి, కొడాలి శ్రీకాంత్ హీటీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శుభాకాంక్షలు

నరసరావుపేట: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శ్రీరామనవమి శుభాకాంక్షలను బుధవారం తెలియ చేశారు. సీతారాముల చల్లని దీవెనలతో ప్రజలు అందరూ సకల సౌభాగ్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు. ఇంటింటా శ్రీరాముని కల్యాణాన్ని వేడుకగా నిర్వహించుకోవాలని, వారి అనుగ్రహం ఉండాలని ఆకాంక్షించారు.

బాల్యవివాహాలపై అవగాహన సదస్సు

వినుకొండ(నూజెండ్ల) : బాలికలకు చిన్న వయసులోనే వివాహం చేయడం చట్ట విరుద్ధమని ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరమ్మ తెలిపారు. నూజెండ్ల మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బాల్యవివాహాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికా విద్యతోనే సంపూర్ణ వికాసం పొందుతారని, సాంఘిక దురాచారాల పట్ల మహిళలకు, బాలికలకు చైతన్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం చందోలు నాగవాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ భవన నిర్మాణానికి ఎంపీ నిధులు

నరసరావుపేట: స్థానిక కోర్టు ప్రాంగణంలో నూతన బార్ అసోసియేషన్ భవన నిర్మాణానికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తన ఎంపీ నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షులు కాకుమాను బాలహనుమంతారెడ్డి బుధవారం చెప్పారు. ఈసందర్భంగా ఎంపీకి ధన్యవాదాలు తెలిపారు. కాగా, ఇప్పటికే ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రూ.25 లక్షల సహాయం ప్రకటించిన విషయం విదితమే.